ప్రజాజ్యోతి
సోమవారం 04 మే 2026
12 పేజీలు
కరీంనగర్
రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి

# వైభవంగా 'ఇందిరమ్మ ఇళ్ల' ప్రారంభోత్సవం

## ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**బీర్ పూర్, మే 3, ప్రజా జ్యోతి:**

పేదవాడి సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఆయన ప్రారంభించి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన బింగీ మానస రాజేందర్, పోతారం (గణేష్ పల్లి)కి చెందిన

2

# కరీంనగర్‌లో పి ఎం జె జ్యువెల్లరీ షాప్‌లో


# కాల్పుల కలకలం

- బంగారం కొంటామని వచ్చి కాల్పులు జరిపిన దుండగులు
- ధైర్యంగా ఎదుర్కొన్న సిబ్బంది.. దుండగుల కోసం పోలీసుల గాలింపు
- కాల్పుల్లో గాయపడ్డ నలుగురు సిబ్బంది
- బంగారం ఎత్తుకెళ్ళిన దుండగేలు
- దొంగల కోసం 12 ప్రత్యేక బృందాల గాలింపు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్ బ్యూరో, క్రైమ్, మే 3( ప్రజాజ్యోతి )**

కరీంనగర్ నగరంలోని జ్యోతినగర్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం జరిగిన జ్యువెలరీ షాపు కాల్పుల ఘటన తీవ్ర సంచలనానికి దారితీసింది. బంగారం కొనుగోలు చేస్తున్నట్లు నటిస్తూ షాపులోకి ప్రవేశించిన ఐదుగురు దుండగులు తుపాకులతో బెదిరించి బంగారు ఆభరణాలు దోచుకెళ్లేందుకు యత్నించగా, అడ్డుకున్న సిబ్బందిపై కాల్పులు జరిపిన ఘటన కలకలం రేపింది.ఈ ఘటనలో గాయపడిన సిబ్బందిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ప్రస్తుతం వారి ప్రాణాలకు ప్రమాదం లేదని వైద్యులు వెల్లడించినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.







**ఘటన ఎలా జరిగింది?**

పోలీసులు, షాపు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం --- సాయంత్రం సమయంలో ఒక వ్యక్తి ముందుగా షాపులోకి వచ్చి "20 గ్రాముల గోల్డ్ చైన్ చూపించండి" అంటూ మాట్లాడాడు. కొద్దిసేపటికే మరో ఇద్దరు వచ్చి బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తామని చెప్పారు. సిబ్బంది ఆభరణాలు చూపిస్తున్న సమయంలో మరో ఇద్దరు షాపులోకి ప్రవేశించారు.అంతలోనే ఐదుగురు కలిసి తుపాకులు బయటకు తీసి సిబ్బందిని బెదిరించారు.





తెలుగు, హిందీ భాషల్లో మాట్లాడుకుంటూ షాపులోని బంగారు ఆభరణాలను బ్యాగుల్లో నింపేందుకు ప్రయత్నించారు. అయితే షాపు సేల్స్ మేనేజర్‌తో పాటు ఇతర సిబ్బంది ధైర్యంగా ఎదురుదాడి చేసి వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు.

2

# ప్రతి గింజకు ప్రభుత్వం భరోసా

*అడిషనల్ కలెక్టర్‌తో కలిసి కేంద్రాల పరిశీలన

*రైతులను ఇబ్బంపెట్టే ప్రయత్నాలపై హెచ్చరిక.. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**కొడిమ్యాల,మే 03,(ప్రజాజ్యోతి):**

రైతులు కష్టపడి పండించిన ధాన్యం ప్రతి గింజకు ప్రభుత్వం భరోసా కల్పించి కొనుగోలు చేస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు.ఆదివారం జగిత్యాల అదనపు కలెక్టర్ బిఎస్ లత తో కలిసి మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు.

2

# రెనే హాస్పిటల్‌లో "రెనే మోకాలు కీలు మార్పిడి లైవ్ సర్జరీ సీపీడీ విజయవంతం

## రెండు రాష్ట్రాల నుంచి హాజరైన 220 మంది ఆర్థోపెడిక్ సర్జన్లు

## ఆరు మోకాలి మార్పిడి శస్త్రచికిత్సల ప్రత్యక్ష ప్రసారం



**కరీంనగర్ టౌన్,మే 3 (ప్రజాజ్యోతి )**

కరీంనగర్‌లోని రెనే హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన "రెనే మోకాలు కీలు మార్పిడి లైవ్ సర్జరీ సీపీడీ - 2026" కార్యక్రమం ఘనంగా, విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి సుమారు 220 మంది ఆర్థోపెడిక్ సర్జన్లు హాజరై విశేష ఆసక్తితో పాల్గొన్నారు.

2

## వైభవంగా 'ఇందిరమ్మ ఇళ్ల' ప్రారంభోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

దడ్డ భూమక్క, బీర్ పూర్ మండలానికి చెందిన నరుకట్ల రజిత మహేష్, జగిత్యాల అర్బన్ ధరూర్ గ్రామానికి చెందిన షరీఫ్ అప్పా, రాయికల్ మండలం రామాజిపేటకు చెందిన ధ్యానవేని భీమక్క, మోత్కుర్ ప్రమీల ఇళ్ల గృహ ప్రవేశ వేడుకలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఇళ్లను ప్రారంభించి, మహిళలకు చీరలను కానుకగా అందజేసి ఆశీర్వదించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ:**

- అభివృద్ధికి బాటలు: జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
- ఇందిరమ్మ ఇళ్ల గణాంకాలు: నియోజకవర్గానికి మొత్తం 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ప్రస్తుతం 2400 ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు.
- ముందంజలో గ్రామాలు: అత్యధికంగా రేచపల్లికి 106, బీర్పూర్ కు 104 ఇళ్లు మంజూరయ్యాయని, ప్రతి గ్రామానికి 30 నుండి 50 ఇళ్లు కేటాయించినట్లు పేర్కొన్నారు.
- మంత్రి పొంగులేటి కృషి: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నప్పటికీ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు కేటాయిస్తున్నారని, త్వరలోనే మిగిలిన అర్హులందరికీ ఇళ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్య, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, కెడిసిసి మెంబర్ ముప్పాళ్ళ రామచందర్ రావు, దామోదర్ రావు, సర్పంచులు రాధ రాజు, శ్రీనివాస్, హరీష్, సుషేన్, బెజ్జంకి మోహన్, ఎంపిడిఓలు సలీం, చిరంజీవి, భీమేష్, ఉప సర్పంచ్ బాలే శ్రీనివాస్, నాయకులు కోల శ్రీనివాస్, మల్లారెడ్డితో పాటు వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రతి గింజకు ప్రభుత్వం భరోసా

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. కొడిమ్యాల మండలంలో కొందరు స్వార్థపరులు రైతులను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, వారి మాటలను నమ్మవద్దని సూచించారు. గతంలో సాగునీటి కోసం రైతులు ఆందోళనలు చేయాల్సి వచ్చేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవని చెప్పారు. అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత మాట్లాడుతూ కేంద్రం నుంచి బాయిల్డ్ రైస్ ఆర్డర్లు రాకపోవడంతో కొంత ఇబ్బంది ఏర్పడిందన్నారు. రాబోయే కాలంలో సన్న రకం వరి సాగుపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నరేష్, సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి, పీసీసీ సభ్యుడు మహిపాల్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేష్, మాజీ ఫ్యాక్స్ చైర్మన్ రాజనర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## గాయపడ్డ బాధితులకు అండగా ఉంటాం



**కరీంనగర్ టౌన్, మే 3(ప్రజాజ్యోతి )**కరీంనగర్ లోని పీఎంజే జ్యువెలరీ లో చొరబడి కాల్పులు జరిపి దొంగతనానికి పాల్పడిన దుండగులను పోలీసులు పట్టుకొని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. పిఎంజె జువెలర్స్ లో దుండగులు జరిపిన కాల్పుల్లో పలువురు గాయపడ్డారని వారికి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బాధితులకు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందేలా చూస్తామని చెప్పారు. బాధితులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని తెలిపారు. డిఐజి చంద్రశేఖర్ రెడ్డి సిపి గౌస్ ఆలం సత్వరమే స్పందించి ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించిన అభినందనీయమని పేర్కొన్నారు. దుండగులను పట్టుకునేందుకు పోలీస్ అధికారులు ముమ్మరంగా చర్యలుతీసుకుంటున్నారని తెలిపారు. కాల్పుల ఘటన చోరీపై ప్రజలంతా ఎలాంటి ఆందోళన చెందవద్దని రాజేందర్రావు కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అహర్నిశలు పాటుపడుతున్నారని పేర్కొన్నారు.

# కరీంనగర్‌లో పి ఎం జె జ్యువెల్లరీ షాప్‌లో కాల్పుల కలకలం

(మొదటి పేజీ తరువాయి)

ఈ క్రమంలో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. కాల్పుల్లో కొంతమంది సిబ్బందికి గాయాలయ్యాయి. అయితే సిబ్బంది ప్రతిఘటనతో ఒక బ్యాగ్‌ను అక్కడే వదిలేసి దుండగులు పరారైనట్లు సమాచారం.

**హుటాహుటిన ఘటనాస్థలికి బండి సంజయ్**

ఘటన సమాచారం అందుకున్న వెంటనే కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ కుమార్ తదితరులతో కలిసి జ్యోతినగర్‌లోని పీఎంజే జ్యువెలరీ షాపుకు చేరుకున్నారు.షాపులోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన ఆయన, సిబ్బందిని పరామర్శించి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్‌తో మాట్లాడి దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు.

**దుండగులను కచ్చితంగా పట్టుకుంటాం" బండి సంజయ్**

మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఘటనను "అనుకోని, అత్యంత దురదృష్టకర సంఘటన"గా అభివర్ణించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఘటన జరిగే సమయానికి కేవలం పది నిమిషాల ముందు నేనే అదే ప్రాంతంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నాను. పోలీసులు కూడా అక్కడే ఉన్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అప్రమత్తమై కరీంనగర్ నగరాన్ని జల్లెడ పడుతున్నారు. దుండగులను కచ్చితంగా పట్టుకుంటారనే నమ్మకం ఉంది" అని తెలిపారు.అలాగే షాపు సిబ్బంది చూపిన ధైర్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. "తుపాకులు చూపించి బెదిరించినా సిబ్బంది వెనక్కి తగ్గలేదు. ఎంతో ధైర్యంగా ప్రతిఘటించారు. అదే సమయంలో వారికి గాయాలయ్యాయి" అని పేర్కొన్నారు.

**నగరమంతా హై అలర్ట్**

ఘటన అనంతరం నగర పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. నగరంలోని ప్రధాన రహదారులు, అవుట్ స్కర్ట్స్ ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషిస్తున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరిస్తోంది. దుండగులు ఎలాంటి వాహనంలో వచ్చారు? ఎంత మేర బంగారం తీసుకెళ్లారు? స్థానికుల సహకారం ఉందా? అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

**వ్యాపారుల్లో ఆందోళన**

పట్టపగలు జరిగిన ఈ కాల్పుల ఘటనతో నగరంలోని జ్యువెలరీ వ్యాపారులు, వ్యాపార వర్గాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రజలు భారీ సంఖ్యలో ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని భద్రత కట్టుదిట్టం చేశారు. పి.ఎం.జె. జ్యువలర్స్ షాపును పరిశీలించి, బాధితులను పరామర్శించిన ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి

**తెలంగాణ:** మల్టీజోన్1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి చోరీ ఘటన జరిగిన ప్రాంతంలో పర్యటించారు. ముందుగా ఆయన క్రైమ్ సీన్‌ను (ఘటనా స్థలాన్ని) క్షుణ్ణంగా పరిశీలించి, దర్యాప్తు పురోగతిపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.అనంతరం, ఐజీపీ స్థానిక ఆసుపత్రిని సందర్శించి, ఈ ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూచిస్తూ, వారికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో ఆయన వెంట కరీంనగర్ సీపీ గౌస్ ఆలం పలువురు పోలీస్ ఉన్నతాధికారులు ఉన్నారు.

## పిఎంజె జ్యువెలరీ దోపిడీ నిందితుల కోసం గాలింపు



**కరీంనగర్ క్రైం,మే 03,ప్రజాజ్యోతి:** కరీంనగర్ నగరంలోని పీఎంజే జ్యువెలరీ షోరూమ్‌లో తుపాకులతో దోపిడీకి పాల్పడిన నిందితుల కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు.సీసీటీవీ ఫుటేజీలో నిందితుల చిత్రాలు నమోదయ్యాయి.బ్లాక్ కలర్ పల్సర్,వైట్ కలర్ అపాచీ బైక్‌లపై సంచరిస్తున్న అనుమానితులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరారు. నిందితుల గురించి సమాచారం అందించిన వారికి రూ.1 లక్ష నగదు బహుమతి ప్రకటించారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.వాహనాలు కనిపించిన వెంటనే డయల్ 100 లేదా 8712670744,8712670745 నంబర్లకు సమాచారం అందించాలని కరీంనగర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## వడ్లు కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన



**మంథని, మే 03 (ప్రజాజ్యోతి):** గత 20 రోజులుగా కొనుగోలు కేంద్రంలో పోసిన తమ వరి ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ మంథని మండలం అడవిసోమన్ పల్లిలో రైతులు రోడ్డెక్కి ఆదివారం ఆందోళనకు దిగారు. మంథని కాటారం ప్రధాన రహదారి అడవి సోమన్న పెల్లి వద్ద రైతులు వెంటనే తమ ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా చేపట్టారు. గ్రామంలోని రెండు వర్గాలుగా ఏర్పడి నేను అంటే నేను అని పంతాలకు పోయి కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో వడ్లు కల్లంలో పోసి ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 20 రోజులైనా ఇప్పటి వరకు తూకం వేయకపోవడంతో తామంతా తీవ్రంగా నష్టోతున్నమని అందుకే తప్పని పరిస్థితిలో రోడ్డు ఎక్కాల్సి వచ్చిందని రైతులు వెల్లడించారు. విషయం తెలుసుకున్న మంథని పోలీసులు ఏఎస్ఐ మల్లయ్య గౌడ్ ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

## ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ

**మంథని, మే 03 (ప్రజాజ్యోతి):** ప్రతి సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్లో నిర్వహించే ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ ఇకపై మంథని రెవెన్యూ డివిజన్ కార్యాలయం లో ఉంటుందని ఆర్డీవో సురేష్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజావాణి డివిజనల్ స్థాయి ప్రజా పిర్యాదులు రెవెన్యూ డివిజల్ అధికారి కార్యాలయం మంథనిలో ప్రతి సోమవారం ఉదయం: 1030 గంటల నుంచి మధ్యాహ్నము 2 గంటల వరకు నిర్వహించబడుతుందన్నారు. మంథని రెవెన్యూ డివిజల్ పరిధిలోని మంథని, రామగిరి, ముత్తారం, కమాన్ పూర్, మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆర్డిఒ సురేష్ కోరారు.



## రెనే హాస్పిటల్‌లో "రెనే మోకాలు కీలు మార్పిడి లైవ్ సర్జరీ సీపీడీ విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమంలో భాగంగా రెనే హాస్పిటల్‌లో మొత్తం ఆరు మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో త్రిధా హోటల్స్‌లోని ఉత్సవ్ హాల్‌కు ప్రత్యక్ష ప్రసారం చేశారు. పాల్గొన్న వైద్యులు లైవ్ సర్జరీలను వీక్షిస్తూ నిపుణుల నుంచి సాంకేతిక వివరాలు, ఆధునిక చికిత్సా విధానాలపై విలువైన అవగాహన పొందారు.ప్రముఖ వైద్యుల పాల్గొనడంతో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టోసా అధ్యక్షులు ప్రొఫెసర్ డా. రామ్ కుమార్ రెడ్డి హాజరై ప్రసంగించారు. గెస్ట్ ఆఫ్ ఆనర్‌గా డా. అఖిల్ దాడి, డా. రజిని ప్రియదర్శిని పాల్గొన్నారు. అదేవిధంగా పలువురు ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణులు ప్రత్యేక అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దారు."హైదరాబాద్ తర్వాత రెనేలోనే రోబోటిక్ మోకాలి మార్పిడి"ఈ సందర్భంగా ప్రొఫెసర్ డా. బంగారి స్వామి మాట్లాడుతూ, హైదరాబాద్‌ను మినహాయిస్తే తెలంగాణలో రోబోటిక్ సాంకేతికత ద్వారా మోకాలి కీలు మార్పిడి చికిత్స అందుబాటులో ఉన్న ఆసుపత్రి రెనే హాస్పిటల్ మాత్రమేనని తెలిపారు."సాధారణంగా ఎంతో ఖరీదైన ఈ చికిత్సను మన ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చుతో అందించడం మా ప్రధాన లక్ష్యం. ఇలాంటి సీపీడీ కార్యక్రమాలు వైద్యుల పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో ఎంతో ఉపయోగపడతాయి" అని పేర్కొన్నారు.

**ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన**

ఈ సీపీడీ కార్యక్రమం ద్వారా మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలలో తాజా విధానాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శస్త్రచికిత్సా నైపుణ్యాలపై పాల్గొన్న వైద్యులకు విస్తృత అవగాహన లభించింది. కార్యక్రమంలో టోసా అధ్యక్షులు ప్రొఫెసర్ డా. రామ్ కుమార్ రెడ్డి, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డా. ఆర్ముగం, డా. రత్నాకర్ రావు, డా. కృష్ణ కిరణ్, డా. అఖిల్ దాడి, డా. ఆదర్శ అన్నప రెడ్డి, డా. అఖిల సుందర్, కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షురాలు డా. ఆకుల శైలజ, తానా కరీంనగర్ కోశాధికారి డా. వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన వైద్యులు, అతిథులు, నిర్వాహకులకు ప్రొఫెసర్ డా. బంగారి స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

# షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం.. బాధితులకు ఎమ్మెల్యే భరోసా!



**బీర్ పూర్, మే 3, ప్రజా జ్యోతి:** సారంగాపూర్ మండల కేంద్రంలో విషాదం చోటుచేసుకుంది. నిరుపేద కుటుంబానికి చెందిన యాదవవేణి భూమయ్య నివాసంలో శుక్రవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిబూడిదైంది.స్థానికుల కథనం ప్రకారం.. భూమయ్య కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి ఇంటి బయట నిద్రిస్తున్నసమయంలో, అర్ధరాత్రి ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంటికి నిప్పంటుకుంది. మంటలను గమనించిన కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు వెంటనే అప్రమత్తమై ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే ఇల్లు పూర్తిగా ధ్వంసమై ఆస్తి నష్టం వాటిల్లింది.స్థానిక సర్పంచ్ చేకుట అరుణ శేఖర్ ద్వారా సమాచారం తెలుసుకున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శనివారం ఘటన స్థలాన్ని సందర్శించారు. కాలిపోయిన ఇంటిని పరిశీలించి, బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాధితులకు ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నిరుపేద కుటుంబానికి త్వరలోనే 'ఇందిరమ్మ ఇల్లు' మంజూరు చేయిస్తామని మాట ఇచ్చారు. తక్షణ సహాయం కింద నిత్యావసరాల కోసం బాధితులకు కొంత నగదును అందజేసి భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్వో వహిదొద్దీన్, ఎస్సై గీత, ఆర్ఐ వెంకటేష్, మాజీ సర్పంచ్ గుర్రాల రాజేందర్ రెడ్డి, పోతారాం సర్పంచ్ శ్రీనివాస్, నాయకపుగూడెం సర్పంచ్ పుష్పనాథ్, ఇతర నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నీడనే ప్రాణం... గొడుగు కింద అవ్వ తిఇప్పలు

**ముస్తాబాద్, మే 3 ( ప్రజా జ్యోతి):**



తెలంగాణ ఎండలంటే మామూలు కాదు గదా! పొద్దుగాల పది దాటిందంటే చాలు... సూర్యుడు నిప్పుల కుప్పలా మండిపోతాడు. నెత్తి మీద అగ్గి పోసినట్టుగా, ఒళ్లు మొత్తం చెమటతో తడిసి ముద్దవుతుంది. రోడ్ల మీద ఎండమావులు కనిపిస్తున్నాయి గానీ, మనుషులే కనిపించని పరిస్థితి. గాలి కూడా వేడి వేడిగా తగిలి, ముఖంపై సెరపలు కొట్టినట్టుగా అనిపిస్తుంది. ఈ మండుటెండల్లో సామాన్యుల పరిస్థితి ఆగమాగంగా మారుతోంది. “ఈ ఎండలల్లో ఎట్ల బతకాలయ్యా బిడ్డా?” అన్నట్టుగా ఆమె ముఖం చూస్తేనే అర్థమవుతుంది. చుట్టూ మండే వేడి మధ్య, ఆ చిన్న నీడనే ప్రాణంగా భావిస్తూ కూరగాయలు అమ్ముకుంటోంది.

**వాడిపోతున్న కూరగాయలు... ఆరిపోతున్న గొంతు!**

అవ్వ దగ్గర ఉన్న పచ్చిమిర్చి, టమాటాలు కూడా ఎండ తట్టుకోలేక వాడిపోతున్నాయి. గిరాకీ లేకపోయినా పట్టుదలతో కూర్చున్న ఆమె గొంతు ఎండిపోతుంది. అప్పుడప్పుడు ఓ ముద్ద నీళ్లు తాగుతూ, గొడుగు నీడలో తల దాచుకుంటుంది. ఆమె కళ్లల్లో కనిపించే అలసట, ఈ ఎండల తీవ్రతకు అద్దం పడుతోంది.

**జర భద్రం... ఎండ దెబ్బ తగలకూడదంటే!**

అవ్వ లాంటి వాళ్లే కాదు, బయట తిరిగే ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి: బయటకు వెళ్తే గొడుగు లేదా టోపీ తప్పనిసరినీళ్లు, మజ్జిగ వంటి ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి మధ్యాహ్నం వేళ అవసరం లేకుండా బయట తిరగకూడదు ఆ అవ్వ కష్టం చూస్తుంటే “ఎండకు ఎండి, వానకు తడిసి” అనే మాట అక్షరాల నిజమని అనిపిస్తుంది.ఆ చిన్న గొడుగు నీడ ఆమెకు తోడుగా ఉండాలని మనసారా కోరుకుందాం.




## మంథనిలో జె కె ఏ షోటో ఖాన్ కరాటే గ్రేడింగ్ టెస్ట్

**మంథని, మే 03 (ప్రజాజ్యోతి):** మంథని మున్సిపల్ పరిధిలోని శ్రీ లక్ష్మి భారతి ఫంక్షన్ హాల్ లో శనివారం విద్యార్థులకు మంథని షోటో ఖాన్ కరాటే గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. కరాటే మాస్టర్ కోండ్ర నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో ఈ టెస్ట్ లో 40 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించారు. గ్రేడింగ్ టెస్ట్ జెకెఏ షోటో ఖాన్ కరాటే రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా షోటో ఖాన్ ఇనిస్ట్యూట్ కరాటే క్రీడాకారుల్లో చదువులో ప్రతిభ కనబరిచి పదవ తరగతి లో అత్యధిక మార్కులు సాధించిన వడ్లకొండ శ్రీనిత 576, అక్షిత 560, సాయి కారుణ్య 525, మౌనిక 508 ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో హాసిని 458, మణిదీపిక 420, విద్యార్థులను సన్మానించారు. ముఖ్య అతిథులుగా మంథని మున్సిపల్ 2 వార్డు కౌన్సిలర్ నూకల కమల్, మాజీ మార్కెట్ కమిటి చెర్మన్ అజీమ్ ఖాన్, సీనియర్ కరాటే మాస్టర్ మారగోని శంకర్ గౌడ్, సంజీవ్, రాజేందర్ లు అభినందనలు తెలిపారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన పూర్వ విద్యార్థులు

**ఇల్లంతకుంట మే 3(ప్రజాజ్యోతి)** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో గీత విద్యాలయం లో 2002...2005 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థి నాగరాజు మృతి చెందగా వారి కుటుంబానికి ఆదివారం రోజు 2002 2005 బ్యాచ్ కి చెందిన మిత్రులు కలిసి 66వేల రూపాయలు నాగరాజు భార్యకి అందజేశారు. మృతుని కుమార్తె పేరు పై 50.000వేల రూపాయలు డిపాజిట్ చేసి మిగతా 16.000వేల రూపాయలు నాగరాజు భార్య కు ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో గీత విద్యాలయం బ్యాచ్ మిత్రులు. ఉపాధ్యాయులు సన బాబు. తూముకుంట రాంలింగారెడ్డి.. పొన్నాల రాజు. కంకణాల శ్రీనివాస్. సందీప్ రెడ్డి. బాలకిషన్. లక్ష్మణ్. తదితరులు పాల్గొన్నారు




# సీనియర్ జర్నలిస్ట్ కుమారుని పెళ్లికి ప్రముఖుల హాజరు

**ఎల్లారెడ్డిపేట మే 3** ప్రజా జ్యోతి ఎల్లారెడ్డిపేట మండలం లోని రాచర్ల గొల్లపల్లి లో ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ శ్రీ రామోజీ భాస్కర్ కుమారుడు శ్రీ రామోజీ మనోజ్ యొక్క పెళ్లికి రాష్ట్ర నాయకులు నా క్రాఫ్ చైర్మన్ కొండూరు రవీందర్రావు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొండూరు గాంధీరావు టిఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి వేణు గోపి కాంగ్రెస్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజిరెడ్డి, గంగ సాయవ్వ సింగవరం సర్పంచి ప్రముఖులు కొండ ఆంజనేయులు, పాశం దేవా రెడ్డి, లక్ష్మీనారాయణ ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాజీ జనార్ధన్ సీనియర్ జర్నలిస్టు చంద్రశేఖర్, బుగ్గ కృష్ణమూర్తి ,కృష్ణ హరి తదితరులు హాజరయ్యారు.




## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర పరీక్షలు,

**ఎండపల్లి,మే 3, ప్రజా జ్యోతి,** లయన్స్ క్లబ్ ఆఫ్ రాజరాంపల్లి ఆధ్వర్యంలో విజన్ కంటి ఆసుపత్రి నిర్వహణలో కొత్తపేట గ్రామ సర్పంచ్ లయన్ జీరెడ్డి మహేందర్ రెడ్డిసహకారంతో 38 మందికి నేత్ర పరీక్షలు చేయగా వారిలో 14 మందికి కంటిలో(క్యాట్రాక్ట్) లోపాలను వైద్యులు గుర్తించి ఉచిత శస్త్ర చికిత్స కోసంరేకుర్తి కంటి ఆసుపత్రి కి రిఫర్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ ,కే సత్యనారాయణ రావు.కోశాధికారి,లయన్ జి రెడ్డి మహేందర్ రెడ్డి.విజన్ సెంటర్ ఇన్చార్జ్ లయన్ డాక్టర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు,



# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

**కాంగ్రెస్ నాయకుల హాజరు**

**ముస్తాబాద్, మే 3(ప్రజా జ్యోతి):**గూడూరు గ్రామంలో చాకలి శ్రావణి కృష్ణ దంపతుల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్లా బాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి , మాజీ ఎంపిటిసిలు రాజు, శీను గార్లు, గ్రామ పంచాయతీ వార్డ్ సభ్యులు రంజాన్ నరేష్, మిరుదొడ్డి బాను పాల్గొన్నారు.గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు చాకలి బాబు , కొల్లాపురం రాజు , బీసీ సెల్ మండల అధ్యక్షుడు ప్రశాంత్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవరాజు, రాజేందర్, ఉమేష్, గణేష్ తదితరులు పాల్గొని గృహప్రవేశం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

# సామాజిక సేవకుడిగా గుర్తింపు



**గంగాధర మే 03:(ప్రజా జ్యోతి):**గంగాధర మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త తూడి లచ్చయ్య (లచ్చన్న) పలు సేవా కార్యక్రమాలు చేస్తూ చొప్పదండి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నత పేరును సంపాదించుకున్నారు. లచ్చయ్య నియోజకవర్గ వ్యాప్తంగా పలు ఆలయాల నిర్మాణానికి మరియు అభివృద్ధికి విరాళాలు అందజేశారు. అంతేకాకుండా ప్రజలు ఎవరైనా అనారోగ్యంతో లేదా ప్రమాదవశాత్తు ఇబ్బందులు ఎదురుకొంటే చేయూత నివ్వడం తన నైజాం. నియోజకవర్గంలో సామాన్యులు, కుటుంబ పెద్దలు ఎవరైనా మృతి చెందిన విషయం లచ్చయ్య దృష్టికి వస్తె తప్పకుండా హాజరై కుటుంబీకులకు అండగా నిలుస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ పేరును సంపాదించుకున్నాడు. నిరుపేద ఆడబిడ్డల పెళ్ళీలకు అన్ని తను అయ్యి ఓ అన్నగా అండగా ఆయన ఉంటున్నాడు. అలాగే తమ సొంత గ్రామంలో ఆడ పిల్ల బంగారు తల్లి అనే పేరుతో మల్లాపూర్ గ్రామంలో ఆడపిల్ల ఏ గడపాలో పుట్టిన వారి పేరు పై 5,000/ రూపాయలు పోస్ట్ ఆఫీసు ద్వారా సుకన్య సమృద్ధి యోజన పథకంలో భాగంగా ఆయన ఫిక్స్డ్ డిపాజిట్ చేశారు. ఇలాంటి ఉత్తమ పనులు చేసే ఆయనను నియోజవర్గం ప్రజలు ప్రేమగా పిలిచే పేరు లచ్చన్న..

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు హాజరైన వొడితల ప్రణవ్

**వీణవంక, మే 3( ప్రజాజ్యోతి )** వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహప్రవేశాలకు హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఆయనకు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల నెరవేరుతోందని తెలిపారు. మొదటి దశలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోగా, త్వరలో అర్హులకు రెండో విడత ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పాల్గొన్నారు.





## నీట్ పరీక్ష కేంద్రం ఆకస్మిక తనిఖీ

**కొడిమ్యాల,మే 03,(ప్రజాజ్యోతి):**మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న నీట్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు.పరీక్ష కేంద్రంలో భద్రత, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా వంటి అంశాలను పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ నరేష్,ఆర్ ఐ రాజారాం, పరీక్ష నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

## సొంతింటి కలను నెరవేర్చుతున్న కాంగ్రెస్



**గొల్లపెల్లి మే 3 ప్రజాజ్యోతి** గొల్లపెల్లి మండలం రాఘుపట్నం గ్రామంలోని చిట్యాల శ్రీకాంత్ సరిత వారి గృహప్రవేశం లో పాల్గొన్న నిశాంత్ రెడ్డి అయన మాట్లాడుతు పేద ప్రజల సొంత ఇంటి కలను సాకారం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తున్నదని స్థానిక నాయకులు గొల్లపెల్లి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి వివిధ గ్రామాల సర్పంచ్ లు తెలిపారు ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేదలకు గృహాలను అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నట్లు పేర్కొన్నారుఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం గృహాలను మంజూరు చేసి వారి నివాస సమస్యను పరిష్కరిస్తున్నదని అన్నారు ఈ పథకం వల్ల ఇళ్లులేని కుటుంబాలకు ఆశ్రయం లభించడంతో పాటు వారి జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడుతున్నాయని తెలిపారుప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్న ఈ కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని భవిష్యత్తులో మరింత మంది లబ్ధిదారులకు ఈ పథకం ప్రయోజనం చేకూరేలా చర్యలు కొనసాగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ కాసారపు భవాని అరవింద్ గౌడ్ నేరెళ్ల మహేష్ మరియు తదితరులు పాల్గొన్నారు

## ఇల్లు వదిలి వెళ్ళిపోయినా వృద్ధురాలు



**గొల్లపెల్లి మే 3 ప్రజాజ్యోతి** గొల్లపల్లి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన మానాల నర్సవ్వ భర్త మల్లయ్య వయసు 70 సంవత్సరాలు కులం ఎస్సీ మాదిగ ఆత్మకూరు గ్రామంలో తన ఇంటిలో ఒక్కతే ఉంటుంది తేదీ 01.05. 2026 శుక్రవారం రోజున రాత్రి అందాద 12 గంటల సమయంలో తన ఇంటికి తాళం వేసి ఇంటి నుండి వెళ్లి మళ్లీ ఇంటికి తిరిగి రాలేదని తప్పిపోయిన నర్సవ్వ కూతురు అయినా తడగొండ పోచవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లపల్లి ఎస్సై ఎం కృష్ణ సాగర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టమైనదితప్పిపోయిన వ్యక్తి వివరాలుమానాల నర్సవ్వ భర్త లేట్ మల్లయ్య 70 సంవత్సరాలు కులం ఎస్సీ మాదిగ ఆత్మకూరు గ్రామం ఎత్తు 5 అడుగులు చామన చాయ రంగు కలిగి ఉండి ఎరుపు రంగు బ్లౌజు తెలుపు రంగు చీర ధరించి ఉన్నదిపైన తెలిపిన వివరాల ప్రకారం తప్పిపోయిన ఆమె ఆచూకీ ఎవరికైనా తెలిసినచో సమీప పోలీస్ స్టేషన్ నందు సమాచారం ఇవ్వగలరు అని ఎస్సై ఎం కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు

# ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ చేతుల మీదుగా గృహ ప్రవేశం



**రాయికల్, మే 03 (ప్రజా జ్యోతి)** రాయికల్ మండలం రామాజీపేట్ గ్రామానికి చెందిన ధ్యానవేణి భీమక్క ఎర్రయ్య, మోత్కురి ప్రమీల-కీ.శే లక్ష్మణ్ దంపతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు పథకంలో భాగంగా మంజూరైన ఇల్లు నిర్మాణం పూర్తయింది. ఈ సందర్బంగా నిర్వహించిన గృహ ప్రవేశ కార్యక్రమానికి వారి ఆహ్వానం మేరకు జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. అనంతరం గృహ యజమానులకు చీర కానుకగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఛైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి, సర్పంచ్ బెజ్జంకి మోహన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రావు, సూర విజయ్, ముఖీద్, సర్పంచ్ రాజేష్, బేతి మోహన్ రెడ్డి, గుజ్జుల మోహన్ రెడ్డి, దొంగ గంగారెడ్డి, సత్తయ్య, బొలిశెట్టి నారాయణ, శ్రీనివాస్, మండల సర్పంచులు, ఉప సర్పంచులు, మండల గ్రామ నాయకులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని వృద్ధునికి తీవ్ర గాయాలు ,?



**ఎండపల్లి, మే 3,ప్రజా జ్యోతి** ఎడ్ల బండిని కారు ఢీకొన్న ఘటనలో వృద్ధునికి తీవ్ర గాయాలు అయిన ఘటన ఆదివారం మండలంలోని సూరారం గ్రామంలో చోటుచేసుకుంది . స్థానికుల కథనం మేరకు పాత గూడూరు గ్రామానికి చెందిన బలిజపల్లి పోచయ్య (65) వ్యవసాయ పనులు ముగించుకొని ఎడ్ల బండి పై పాత గూడూరు గ్రామం వైపు వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఎడ్ల బండిని ఢీకొనడంతో పోచయ్య కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ కు సమాచారం అందించి హుటాహుటిన కరీంనగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## బంగారం చోరీ నిందితుల కోసం పోలీసుల గాలింపు



**ఎండపల్లి, మే 3,ప్రజా జ్యోతి** కరీంనగర్ జ్యోతి నగర్ లోని జ్యువెలరీ షాపులో ఐదుగురు దుండగులు తుపాకులతో కాల్పులు జరిపి బంగారం దోచుకెళ్లిన ఘటనలో నిందితుల కోసం మండలంలోని రాజారాంపల్లి వద్ద వెల్గటూర్ ఎస్సై పి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసుల ప్రత్యేక బృందాలు విస్తృత గాలింపు చర్యల చేపట్టారు,ఈ సందర్భంగా ప్రతి వాహనాన్ని నిశితంగా తనిఖీ చేసి పంపిస్తున్నారు , ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు,

## పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేసినబీజేపీ కౌన్సిలర్లు



**వేములవాడ,మే,3:ప్రజాజ్యోతి.** వేములవాడ పట్టణంలో 26వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల అమర్య లక్ష్మీరాజం పెళ్లి రోజు సందర్భంగా వేములవాడ పట్టణంలోని బిజెపి కౌన్సిలర్లు కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు 26 వార్డు బిజెపి నాయకులు కేక్ కట్ చేయించి పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి శుభాకాంక్షలు తెలియజేసినారు

## ఉప సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం



**పెద్దపల్లి ప్రతినిధి మే 3 ప్రజా జ్యోతి;** రాష్ట్ర ఉపసర్పంచ్ ల సంఘం అధ్యక్షులు లావుడ్య రాములు నాయక్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు తలారీ స్వప్న సాగర్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీని నియమించడం జరిగింది.పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు గా మేడి అశోక్ గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర కమిటీ నాయకులు రాములు నాయక్,బొట్ల కార్తీక్,కొప్పుల మహేష్, జిల్లా కమిటీ ఇంచార్జి స్వప్న నరేష్ గార్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లు గోలి సుధాకర్, హరీష్, జంగా అనిల్, ధర్ముల రవి పాల్గొన్నారు.

## దేశాయిపేటలో గంజాయి పట్టివేత

**మేడిపల్లి, మే 3(ప్రజాజ్యోతి):**జగిత్యాల జిల్లా భీమారం మండలం దేశాయిపేట గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం పోలీసులు జరిపిన తనిఖీల్లో ముగ్గురు వ్యక్తులు గంజాయితో పట్టుబడ్డారు. వారి వద్ద నుండి 60 గ్రాముల గంజాయి, ఒక బైక్ మరియు 3 సెల్‌ఫోన్లను మేడిపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితులు పొన్నం కార్తీక్ కట్కం రణధీర్ మరియు కొప్పుల తరుణ్ కొంతకాలంగా గంజాయిని సేవిస్తూ, విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో ఎస్సై ఎం. శ్రీధర్ రెడ్డి నేతృత్వంలో ఈ దాడులుజరిగాయి, గంజాయి రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. ఎవరైనా గంజాయికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని ఆయన కోరారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**మంథని, మే 03 (ప్రజా-జ్యోతి):** మంథని మండలం అడవి సోమన్ పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసిఎస్ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్ రైతులు, హామలీలతో కలిసి ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. రైతులకు అందుబాటులో ఏర్పాటు చేసి ధాన్యం కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గౌడ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

**చొప్పదండి ,మే 3 (ప్రజాజ్యోతి):** చొప్పదండి గౌడ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం యువజన సంఘం అధ్యక్షుడు బొడిగే సాయి కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షుడిగా బొడిగె గంగరాజు, ముఖ్య సలహాదారులు బోడిగే శ్రీనివాస్, పూదరి మధు, బూరుగు నరేష్, ఉపాధ్యక్షులు బుర్ర హరీష్, బత్తిని ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి బోడిగే శ్రావణ్ కుమార్,ప్రచార కార్యదర్శి పూదరి అనిల్ ,సంయుక్త కార్యదర్శిలు పొన్నం శ్రీనివాస్, జాగిరి సాయి గణేష్, కార్యవర్గ సభ్యులు కట్ల ఉపేందర్, బొడిగె నిఖిల్ , బొడిగె సాయి చందు, బోడిగే వినయ్ లను ఎన్నుకున్నారు. అనంతరం గౌడ కౌన్సిలర్ పెరమండ్ల మానస గంగయ్య గౌడ్ కు సన్మానం చేశారు. పది ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన గౌడ విద్యార్థులు బొడిగె గగన శ్రీ, జాగిరి మణిచరణ్, చేపూరి స్నేహ, బుర్ర వర్షిత లకు శాలువ తో సన్మానించారు. ఈ సందర్భంగా వైస్ చైర్ పర్సన్ మానస గంగయ్య గౌడ్ విద్యార్థులకు శాలువాతో సన్మానించి మెమొంటో అందించి అభినందించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర మల్లేశం, డైరెక్టర్లు బోడిగే శ్రీనివాస్, బట్టు రాజు, పూదరి శ్రీనివాస్, నాయకులు బత్తిని ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# పత్రిక కు స్వేచ్ఛపండుగకాదు ప్రజాస్వామ్యానికిప్రాణవాయువు

**వేములవాడ,మే,3:ప్రజాజ్యోతి.** మే 3, 2026న జరుపుకునే ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం కేవలం ఒక గుర్తింపు దినం మాత్రమే కాదు... సత్యాన్ని వెలికితీసే స్వరాల భద్రతపై ప్రపంచం తన మనస్సాక్షిని ప్రశ్నించుకునే రోజు. ఈ సందర్భంగా అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ పరిశీలనా సంస్థ విడుదల చేసిన 2026 ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో భారతదేశం 180 దేశాల్లో 157వ స్థానానికి పడిపోవడం ఆందోళనకరం. 2025లో 151వ స్థానంలో ఉన్న భారత్ ఆరు స్థానాలు కోల్పోయింది. స్కోరు 32.96 నుంచి 31.96కి తగ్గి "అత్యంత తీవ్రమైన పరిస్థితి" వర్గంలోకి చేరింది. ఇది కేవలం సంఖ్యల పతనం కాదు...ప్రపంచపు అతి పెద్ద ప్రజాస్వామ్యంగా చెప్పుకునే దేశంలో సమాచార స్వేచ్ఛ బలహీనపడుతున్న సంకేతం. గత 25 ఏళ్లలో ప్రపంచ సగటు కూడా కనిష్ఠస్థాయికి చేరడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.ప్రపంచవ్యాప్తంగా జర్నలిస్టుల పరిస్థితి 2025లో ప్రపంచవ్యాప్తంగా 67 నుంచి 128 మంది జర్నలిస్టులు తమ విధి నిర్వహణలో హతమయ్యారు. గాజా, యుక్రెయిన్, సూడాన్, వంటి యుద్ధ ప్రాంతాలు అత్యంత ప్రమాదకర ప్రాంతాలుగా నిలిచాయి. దాదాపు 500 మంది జర్నలిస్టులు జైళ్లలో ఉన్నారు. చైనా, రష్యా, మయన్మార్ వంటి దేశాలు ముందంజలో ఉన్నాయి. జర్నలిస్టుల హత్యల్లో 85 నుంచి 90 శాతం కేసుల్లో




నేరస్తులకు శిక్ష పడకపోవడం ప్రపంచ వ్యాప్తంగా దోషులకు ధైర్యం ఇస్తోంది.

***భారతదేశంలో పెరుగుతున్న ప్రమాదం.***

2014 నుంచి భారతదేశంలో 28 మంది జర్నలిస్టులు హతమయ్యారు. వారిలో దాదాపు సగం మంది భూవివాదాలు, పర్యావరణ నాశనం, అక్రమ తవ్వకాలు, అవినీతి వంటి అంశాలపై వార్తలు రాసినవారే. అంటే ప్రజల కోసం నిజం బయటపెట్టే ప్రయత్నమే ప్రాణహానిగా మారుతోంది. ముఖ్యంగా గ్రామీణ, జిల్లా స్థాయి విలేకరులు అత్యంత ప్రమాదంలో ఉన్నారు.

**భౌతిక భద్రత – వార్త కోసం ప్రాణాల పణం.***

జిల్లా, గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే విలేకరులు స్థానిక రాజకీయ శక్తులు, అక్రమ వర్గాలు, మాఫియా, అధికార వ్యవస్థల ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. చాలాసార్లు నిజం రాస్తే దాడులు, బెదిరింపులు, తప్పుడు కేసులు తప్పవు. ప్రభుత్వ వ్యతిరేక అంశాలు, భూకబ్జాలు, అవినీతి, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల వాస్తవాలు, ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులపై ప్రభుత్వాలు కఠిన చట్టాలు, దర్యాప్తు సంస్థలు, భద్రతా వ్యవస్థలను ఒత్తిడి సాధనాలుగా ఉపయోగిస్తున్నాయనే విమర్శలు పెరుగుతున్నాయి.

**అసురక్షిత, వెట్టిచాకిరిలో జర్నలిస్టులు.***

అవినీతి, దోపిడీ, వెట్టిచాకిరిపై కథనాలు ప్రచురించే పత్రికల వ్యవస్థలోనే అనేక ప్రాంతాల్లో జర్నలిస్టులు అత్యంత అసురక్షిత శ్రమ పరిస్థితుల్లో ఉండటం చేదు వాస్తవం. ముఖ్యంగా జిల్లా స్థాయిలో పని చేసే విలేకరులకు కనీస వేతనం కూడా లేకపోవడం పెద్ద విషాదం. చాలా మంది స్ట్రింగర్లు, ఫ్రీలాన్సర్లు, స్థానిక రిపోర్టర్లు సంస్థలకు వార్తలు అందించడమే కాదు... ప్రకటనలు తెచ్చే ఆదాయ సాధనాలుగా కూడా ఉపయోగించబడుతున్నారు. వార్తా సేకరణతో పాటు ప్రకటనల వేటను కూడా భుజాన వేసుకుని, సంస్థకు ఆదాయం రాకపోతే విలువలేని వారిలా పక్కనబెట్టబడుతున్నారు.

**కార్మిక రక్షణల క్షీణత**

1955లో అమలులోకి వచ్చిన వర్కింగ్ జర్నలిస్టుల చట్టం జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ ఇచ్చింది. కానీ కొత్త కార్మిక నియమావళిలో ఆ ప్రత్యేకత తగ్గిపోవడంతో జర్నలిస్టుల వృత్తి ప్రమాదాలు, అసాధారణ పని గంటలు, సామాజిక భద్రత అంశాలు బలహీనపడ్డాయి. ఫలితంగా కాంట్రాక్ట్ విధానం పెరిగి, వేతనాలు తగ్గాయి.

**ఆర్థిక-రాజకీయ ఒత్తిడి**

పెద్ద వ్యాపార వర్గాలు లేదా రాజకీయ అనుబంధ పెట్టుబడిదారుల ఆధీనంలో మీడియా సంస్థలు ఉండటం స్వతంత్ర వార్తా స్వరాన్ని ప్రభావితం చేస్తోంది. ప్రభుత్వ ప్రకటనలపై ఆధారపడే సంస్థలు విమర్శాత్మక కథనాల విషయంలో వెనుకడుగు వేయాల్సి వస్తోంది. న్యాయపరమైన వేధింపులు కోర్టు కేసులే శిక్షలా మారే పరిస్థితి ఏర్పడుతోంది. విచారణ సంస్థలు, చట్టపరమైన వ్యవస్థలు నిజం చెప్పే స్వరాలను భయపెట్టే ఆయుధాలుగా మారకూడదనే ప్రశ్న మరింత బలంగా వినిపిస్తోంది.

**కలాన్ని కాపాడటం అంటే.. ప్రజాస్వామ్యాన్ని కాపాడటం**

కాబట్టి జర్నలిస్టుల హత్యలపై వేగవంతమైన దర్యాప్తు, కఠిన శిక్షలు, జిల్లా విలేకరులకు కనీస వేతనం, బీమా, చట్టపరమైన రక్షణ, మీడియా సంస్థల్లో శ్రమ హక్కుల అమలు అత్యవసరం. పత్రికా రంగంలో వెట్టిచాకిరీ నిర్మూలన కూడా ప్రెస్ స్వేచ్ఛలో భాగమే. ఎందుకంటే ఆర్థికంగా బానిసైన కలం పూర్తిస్థాయి స్వేచ్ఛతో రాయలేను.ప్రెస్ స్వేచ్ఛ లేని దేశంలో ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల వరకే పరిమితమవుతుంది. ప్రజలకు నిజం చెప్పే స్వరం మూగబోతే, ప్రజాస్వామ్యం రూపం మాత్రమే మిగులుతుంది... ఆత్మ కోల్పోతుంది.



## సహకార సంఘ అభివృద్ధికి పాటుపడండి

**తిమ్మాపూర్ మే 3 (ప్రజాజ్యోతి)** మత్స్యశాఖ సంఘ సభ్యులు ఒకరి కొకరు సహకరించుకుంటూ సహకార సంఘాల అభివృద్ధికి పాటుపడాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో చైర్మన్ గా గెలిచినటువంటి బోళ్ల శంకర్, కోశాధికారి దాసరి తిరుపతి, డైరెక్టర్ లు గంగు రాజమల్లు,గోనెల పర్శరాములు, పండుగ శ్రీనివాస్,కోతి మల్లేశం,కోతి రాజుకుమార్ లకు కేంద్ర మంత్రి శాలువాలతో సన్మానం చేసి అభినందించారు.అనంతరం గ్రామంలో ఉన్నటువంటి చెరువుల అభివృద్ధి కి కేంద్ర నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ద్వారా మంత్రి ని కోరారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గంగు తిరుపతి, పండుగ రాజయ్య, గంగు లక్ష్మణ్ తదితరులు కేంద్ర మంత్రిని కలిసివారిలో ఉన్నారు.



## ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

**చిగురుమామిడి /మే 03 ;ప్రజా జ్యోతి** చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని కరీంనగర్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శివకుమార్‌ప్రణీత దంపతులు ఆదివారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారిని గ్రామ సర్పంచ్,గౌడ సంఘం నాయకులు, గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు.న్యాయమూర్తి దంపతులను గ్రామ సర్పంచ్ చింతపూల నరేందర్, ఉప సర్పంచ్ అనిల్,గౌడ సంఘం నాయకులు గట్టు మొగిలి, లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదె రఘునాథ్ రెడ్డి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి,కంది శ్రీనివాస్ రెడ్డి,గౌడ సంఘం నాయకులు గట్టు ఎల్లయ్య, గట్టు రమేష్, బుర్ర లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, బుర్ర పరశురాములు, బత్తిని శ్రీనివాస్, గట్టు మురళి, డి .కిరణ్, గట్టు కనకయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి సుమంత్,తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు

**తిమ్మాపూర్ మే 3 (ప్రజాజ్యోతి)**కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఒకటవ వార్డు సభ్యులు చిలుకూరు రాజు, ఎనిమిదో వార్డు సభ్యురాలు జక్కని నవ్యా సతీష్. బిజెపి సీనియర్ నాయకులు జక్కుల కుమార్,బూర్ల విద్యాసాగర్,మర్రి రాజు,జనగం సతీష్ ఇతర నాయకులు మానకొండూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది.వారికి రసమయి బాలకిషన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రావుల రమేష్, సీనియర్ నాయకులు ఎడ్ల బుచ్చిరెడ్డి,నాయిని వెంకట్ రెడ్డి,పాశం అశోక్ రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, మాతంగి లక్ష్మణ్,రామంచరామిరెడ్డి , బోర్ర రవీందర్,వార్డు సభ్యులు గడ్డి రమేష్, నాయకులు మాదన రాజేందర్,వేల్పుల మల్లయ్య,మాదన రాజేందర్,పోతుగంటి వీరేందర్,దుండె మోహన్, మారం వీరేష్, కుక్కల రాజయ్య,తుమ్మేటి రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఓదెల్, కసాడి కుమార్, న్యాలం తిరుపతి, నాయిని రమేష్,బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పోతురాజుల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణ కాశీ వేములవాడలో మరో అద్భుతం.

**వేములవాడ,మే,3:ప్రజాజ్యోతి.** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ రాజన్న క్షేత్రం త్వరలో మరో ఆధ్యాత్మిక అద్భుత సోబగును అద్దుకోనుంది భక్తులకు మరియు వేములవాడ ప్రజలకు ఆధ్యాత్మిక అనుభూతిని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే లక్ష్యముతో వేములవాడ పట్టణంలో చేపట్టిన మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు ప్రస్తుతము శరవేగంగా జరుగుతున్నాయి ఈ ప్రాజెక్టులో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న భారీ శివుడి విగ్రహం నిర్మాణం ప్రస్తుతము చివరి దశకు చేరుకుంది అత్యంత కళాత్మకంగా రూపుదిద్దుకుంటున్న ఈ విగ్రహం ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా చుట్టు పక్క జిల్లాల ప్రజల దృష్టిని ఆకర్షిస్తుంది గంభీరమైన రూపంతో ధ్యానముద్రలో ఉన్నట్టుగా కనిపిస్తున్న ఈ శివుని విగ్రహం పూర్తయితే వేములవాడకే తలమానికంగా విలువనుంది మిడి ట్యాంక్ బండ్ పనులు చేరుకోవడంతో రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఇది ఒక పర్యాటక కేంద్రంగా మారనుంది చెరువుగట్టు



వెలపరా వాకింగ్ ట్రాక్ పచ్చని చెట్లు కూర్చున్నందుకు వీలుగా బెంచీలు ఏర్పాటు చేస్తున్నారు సాయంత్రం వేళల్లో విద్యుత్ శివుడి విగ్రహం ముందు కనివిందు చేయనున్నాయి ఈ పనులు పూర్తయితే రాజన్న క్షేత్రానికి వచ్చే భక్తులకు కేవలం దర్శనమే కాకుండా మనసుకు ప్రశాంతత నిచ్చే ఒక అద్భుతమైన వేదిక అందుబాటులోకి రానుంది జిల్లా యంత్రాంగం పనులు వేగవంతం చేయడంతో త్వరలోనే ఈ దృశ్యం భక్తులకు సాక్షాత్కరించనుంది

## ప్రధాని పర్యటనను విజయ వంతం చేయండి

**వేములవాడ,మే,3:ప్రజాజ్యోతి.** వేములవాడ పట్టణంలో ఆది వారం రోజున బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ బిజెపి అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ మీడియా సమావేశం ఏర్పాటు చేసి రామక్రిష్ణ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన హైదరాబాదులో జరిగే నరేంద్ర మోడీ పర్యటనను విజయ వం తం చేయాలని మన భారతదే శానికి గర్వకారమైన ప్రధాన మం త్రి నరేంద్ర మోడీ తన హయాం లో భారత జాతీయతను ఎన్ని కుట్రలు చేసి విచ్చినము చేద్దామ ని ఎందరో కుట్రలు పనిప్రభుత్వం నుఅస్థిరపరిస్తాంఅనుకున్నప్పటికీ మొక్కవోని ధైర్యంతో భారత ప్రజల ఐక్య మత్యం కొరకు నిరం తరం ఎలాంటి ఆశలు లేకుండా స్వార్థం లేకుండా పరిపాలన చేస్తున్నటువంటి ఒకే ఒక వ్యక్తి మన ప్రధాన మంత్రి అని చెప్పక తప్పదు పార్లమెంట్ ఎన్నికల్లో మన బండి సంజయ్ ను పార్లమెంట్ ఎన్నికల్లో ఎలామెజారిటీ తో గెలి పించుకున్నాము అలాగే మన పా ర్లమెంట్ నియోజకవర్గంలోని ప్రజ లు ప్రధానమంత్రి మోడీ సభను విజయవంతంచేయాలనికోరుచున్నాము బీజేపీ నాయకులు కార్య కర్తలు ప్రధాని పర్యటన విజయ వంతం ఆగుటకు కృషి చెయ్యాలి అని కోరారు.

# ప్రపంచ నవ్వులదినోత్సవం

**వేములవాడ,మే,3:ప్రజాజ్యోతి.**ప్రతి సంవత్సరం మే నెల మొదటి ఆదివారం రోజున ప్రపంచవ్యాప్తంగా నవ్వుల దినోత్సవం జరుపుకుంటారు నవ్వు వల్ల కలిగే ఆరోగ్య మానసిక ప్రయోజనాలపై అవగాహన కల్పించడం ప్రపంచ శాంతిని పెంపొందించడం దీని ముఖ్య ఉద్దేశం 1998లో డాక్టర్ మదన్ కటారియా క్షేత్ర ప్రారంభించబడిన ఈ దినోత్సవం ఒత్తిడి తగ్గించి హాయిగా నవ్వడాన్ని ప్రోత్సహిస్తుంది నవ్వు సార్వత్రిక భాష అని తెలియజేయడం రోజుకు కనీసం 30 నిమిషాలు అయినా నవ్వడం ద్వారా శారీరక మానసిక ఆరోగ్య ప్రయోజనాలను పొందగలరు నవ్వడం వల్ల ఒత్తిడి తగ్గి బ్లడ్ ప్రెషర్ తగ్గుతుంది వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది భవిష్యత్తులో పక్షవాతం వచ్చే అవకాశం తక్కువ ఉంటుంది నవ్వు ఒక గొప్ప మందు నవ్వడం వల్ల ఎండోర్ పిన్ అనే రసాయన విడుదలై ఆనందాన్ని ఇచ్చే హార్మోన్లు విడుదలయి మనిషికి ప్రశాంతత కలుగుతుంది నవ్వడం వల్ల మనిషి ఆరోగ్యం చక్కగా ఉంటుంది ఈ మధ్యకాలంలో లాఫింగ్ కబ్లులు ఏర్పాటు చేసుకొని అందరూ కలిసి చక్కగా నవ్వి ఆరోగ్యంగా ఉంటున్నారు

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు సదస్సు




**వేములవాడ,మే,3:ప్రజాజ్యోతి.**వేములవాడ డివిజన్‌లో మే 5న నియోజకవర్గ స్థాయి రైతు సదస్సుతెలంగాణ ప్రభుత్వ ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో భారీ కార్యక్రమంపంట మార్పిడి,ఆయిల్ పామ్ సాగు విస్తరణ ప్రధాన అంశంగా రైతులకు అవగాహనవేములవాడలోని శ్రీ నివాస కళ్యాణ మండపంలో మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు సదస్సు నిర్వహణఆయిల్ పామ్ సాగు యాజమాన్య పద్ధతులు మరియు ఉద్యాన పంటల సాగుపై నిపుణులతో శిక్షణ...షేడ్ నెట్ సబ్సిడీ ద్వారా కూరగాయల సాగుకు లభించే ప్రోత్సాహకాలపై వివరణ తీగ జాతి పందిరి సాగు మరియు కూరగాయల విత్తనాల సబ్సిడీ పథకాలపై అవగాహనడ్రిప్ మరియు స్ప్రింక్లర్ ఇరిగేషన్ పద్ధతుల ద్వారా నీటి పొదుపుపై రైతులకు మార్గదర్శనంమార్కెటింగ్ మెళకువలు మరియు నిల్వ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ప్రత్యేక శిక్షణవేములవాడ నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అధికారుల విన్నపం



## తూకంలో అన్నదాత నిరసన.

**ఎల్లారెడ్డిపేట మే 3( ప్రజా జ్యోతి)** ఎల్లారెడ్డిపేట మండలం లోని పదిరా గ్రామంలో సిరిసిల్ల కామారెడ్డి ప్రధాన రహదారిపై రైతన్న వస్తారోకో 42 కిలోలకు 500 గ్రాముల బరువుతో తూకం వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు బిజెపి నాయకులు ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహి బిజెపి మండల శాఖ అధ్యక్షుడు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు



## యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

**వేములవాడ,మే,3:ప్రజాజ్యోతి.**యువ క్రీడాకారులను ప్రోత్సహించడానికి కెసిఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించగా ఇటీవల దిగ్విజయంగా ముగిసింది. ఇందులో భాగంగా పాల్గొన్న జట్లకు ప్రోత్సాహకంగా ఉండేందుకు చందుర్తి మండలంలోని 10, రుద్రంగి 5 జట్ల క్రికెట్ క్రీడాకారులకు ఆదివారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కెసిఆర్ కప్ తో క్రికెట్ క్రీడాకారులకు క్రీడా స్ఫూర్తి పెంపొందడమే కాకుండా గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారులు తమ ప్రతిభను చాటారన్నారు. టోర్నమెంట్ లో పాల్గొన్న అన్ని జట్లకు క్రికెట్ కిట్లను అందజేసి వారికి ప్రోత్సాహంగా ఉండడమే కాకుండా భవిష్యత్తులో ఇలాంటి క్రీడలను ప్రోత్సహించి క్రీడాకారులను వెలికి తీస్తామని తెలిపారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడల పట్ల ఆసక్తి చూపేందుకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎప్పుడు ముందున్నారని గుర్తు చేశారు. క్రికెట్ ఏ కాకుండా భవిష్యత్తులో కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్ల నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తామని తెలిపారు.

# దేశాభివృద్ధికీ_కాంగ్రెస్సే ప్రధాన అడ్డంకి

**పెద్దపల్లి ప్రతినిధి మే 3 ప్రజా జ్యోతి,:-** భారతదేశ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రధాన అడ్డంకి మారిందని బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. ఆదివారం పెద్దపల్లి పర్యటనలో భాగంగా బీజేపీ జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశానికి ఆయన చీఫ్ గెస్టుగా హాజరై మాట్లాడారు. గత 32 ఏళ్లుగా ఈ దేశంలోని మహిళలకు చట్ట సభల్లో 33% రిజర్వేషన్లు కల్పించాలని బీజేపీ ఎంతగానో ప్రయత్నిస్తోందని గుర్తు చేశారు. ఆనాటి వాజ్ పేయి హయాం నుంచి కూడా



ఈ బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకిస్తూనే వస్తుందన్నారు. ఈ దేశ మహిళలు రాజకీయంగా ఎదగడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదన్నారు. అందుకే మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చిన ప్రతిసారీ కాంగ్రెస్ అడ్డుపడుతూనే ఉంటుందని కొమరయ్య మండిపడ్డారు. డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండీ కూటమి వ్యతిరేకిస్తోందని.. ప్రజలు దీన్ని గమనిస్తున్నారని ఆయన చెప్పుకొచ్చారు. 2047నాటికి మన దేశాన్ని ప్రపంచంలోనే నంబర్ వన్ గా నిలిపే దిశగా కేంద్రంలోని ప్రధాని మోదీ సర్కారు పనిచేస్తోందన్నారు. మరోవైపు మోసకారి కాంగ్రెస్.. దాని మిత్రపక్షాలు మహిళలను, ప్రజలకు మోసం చేస్తూ రాజకీయ లబ్ధి కోసం డ్రామాలు ఆడుతున్నాయని కొమరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, రాష్ట్ర మీడియా ప్రతినిధి అభిషేక్ జగిణి, రామగుండం అభ్యర్థి కందుల సంధ్యారాణి, నారీ శక్తి అభియాన్ జిల్లా కన్వీనర్ చిలుక భారతి పాల్గొన్నారు.



## వివాహ వేడుకకు హాజరైన చల్మెడ

**కోనరావుపేట,మే.03(ప్రజజ్యోతి)**కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన నాయకులు గంగుల ప్రశాంత్, యాదవ్ సోదరుడు శ్రీకాంత్ యాదవ్, వివాహం ధర్మారంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో జరగగా ఈ వేడుకకు బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట కొలనూరు సర్పంచ్ అరవింద్ రావు ,సీనియర్ నాయకులు రాఘవరెడ్డి,సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ భూమిరెడ్డి, నాగుల రాజు,మాజీ ఉప సర్పంచ్ పొన్నం పర్షరామ్ గౌడ్, గోపాల్, ఉప సర్పంచ్ కట్ల బీరయ్య, తదితరులు ఉన్నారు.

## రైతులు వారోత్సవాలకు.. హాజరై అవగాహన పొందాలి:

**వ్యవసాయాధికారి శ్రీనివాస్**



**గంగాధర మే 03: (ప్రజా జ్యోతి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా మే 4 నుంచి 9 వరకు గంగాధర మండలంలో రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఆర్. శ్రీనివాస్ తెలిపారు. మే 4న వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గంగాధర, వెంకటాయపల్లి, బూరుగుపల్లి, గర్శకుర్తి, కురిక్యాల రైతు వేదికల్లో నేల ఆరోగ్యం, మట్టి నమూనాల సేకరణ, మట్టి పరీక్ష ఆవశ్యకత మరియు ఇతర అంశాలపై సమావేశాలు నిర్వహించడం జరుగుతుందినీ ఆయన తెలిపారు. మే 5న ఉద్యాన శాఖ, మే 6న సహకార సంఘాలు మరియు మార్కెటింగ్ శాఖ, మే 7న వ్యవసాయ యాంత్రీకరణ, మే 8న పశుసంవర్ధక శాఖ, మే 9న నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. రైతులు ఈ కార్యక్రమాలకు హాజరై నిపుణుల సూచనలు పొందాలని సూచించారు.

## స్వచ్ఛ వేములవాడ చైర్మన్ పుల్కాం. రాజు.



**వేములవాడ,మే,3:ప్రజాజ్యోతి** '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా వేములవాడ పట్టణంలో పారిశుద్ధ్య పనులు జోరుగా సాగుతున్నాయి. పట్టణ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, మున్సిపల్ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన కాలువల పూడికతీత పనులను చేపట్టింది. పట్టణంలోని చెక్కపల్లి రోడ్డు మరియు న్యూ అర్బన్ కాలనీ సమీపంలోని ప్రధాన రహదారి పక్కన పేరుకుపోయిన మురికిని, పూడికను జెసిబిల సాయంతో తొలగించి, వెంటనే ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కేవలం కాగితాలకే పరిమితం కాకూడదని, క్షేత్రస్థాయిలో మార్పు స్పష్టంగా కనిపించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. 15 వ వార్డ్ చెక్కపల్లి రోడ్డు, న్యూ అర్బన్ కాలనీ ప్రాంతంలో మురుగు సమస్య వల్ల ప్రజలు, పిల్లలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, మరే ఇతర కారణాలను ఆలోచించకుండా తక్షణమే స్పందించి ఈ క్లీనింగ్ పనులను చేపట్టినట్లు వివరించారు. వర్షాలు మొదలైతే ఇక్కడ పరిస్థితి మరింత ఘోరంగా మారుతుందన్న ఉద్దేశంతోనే ఈ చర్యలు తీసుకున్నామన్నారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో, వారి అడుగుజాడల్లో నడుస్తూ వేములవాడను ఒక రోల్ మోడల్ పట్టణంగా మార్చడమే తమ లక్ష్యమని, కానీ ఈ అభివృద్ధి కేవలం అధికారుల వల్ల మాత్రమే సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు. ప్రజలందరూ బాధ్యతగా ఉంటూ రోడ్ల మీద చెత్త వేయకూడదని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. రాబోయే రోజుల్లో పట్టణంలోని ప్రతి కాలనీలో ఇటువంటి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ఇల్లంతకుంట మే 3(ప్రజాజ్యోతి)**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో ని జెడ్పిహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో ఆదివారం జడ్పీహెచ్ఎస్ పాఠశాల 2002 2003 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో భాగంగా చిన్ననాటి స్నేహితులు ఒకే వేదికపై చేరి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ.. ఆనాటి జ్ఞాపకాలను, తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు.ఈ స్నేహితులు గతంలో తమ తోటి స్నేహితుల కష్టసుఖాలను పంచుకొని అనారోగ్యానికి గురైనా, మృతి చెందిన స్నేహితుల కుటుంబాలను స్మరించుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలకు ఆర్థిక సాయం గా 2003 బ్యాచ్ పేరుతో రూపాయలు 18,500 విలువైన సౌండ్ సిస్టంను అందజేశారు పాఠశాల లో ప్రేయర్ కోసం ఉపయోగ పడుతుందని ఆలోచన హాజరైన పూర్వ ఉపాధ్యాయులు కొనియాడారు. ఈ సందర్భంగా మిత్రులు అలనాడు చేసిన చిలిపి చేష్టలను గుర్తు చేసుకుంటూ ఆనందోత్సాహాల్లో మునిగిపోయి అటాపాటలతో సందడి చేశారు. అనంతరం అప్పటి గురువులను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన పూర్వ గురువులు మాట్లాడుతూ.. పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరం ఒకే చోట కలుసుకోవడం ఎంతో సంతోషకరమని అన్నారు. అనంతరం విద్యార్థులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాఠశాల హెడ్మాస్టర్ దూస గోవర్ధన్, పూర్వ హెడ్మాస్టర్ డి శ్రీనివాస్, వెంకన్న సార్, పావని, తిరుమల ,శారద ,భూపతి, కవిత శ్రీనివాస్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.